క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మండంలోని ఆర్ఎస్‌వై కాలనీ–ఎస్టీ, బాబానగర్–బీసీ–బీ, అంగడివీధి–బీసీ–ఇ, ఎన్ఆర్‌పల్లి–బీసీ–సీలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న కడప నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

నేడు ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ సందర్భంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ శుక్రవారం ఉదయం కడప నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం 11 గంటలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాలులో వ్యాధి గురించి అవగాహన సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీ, సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, మహిళా సేవా సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు వేలం పాట

చెన్నూరు : స్థానిక గ్రామ పంచాయతీ 2023–24 సంవత్సరానికి గాను బస్టాండు, కూరగాయల మార్కెట్, జంతువధశాలలకు సంబంధించి సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రామసుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు పంచాయతీకి ఇంటి పన్ను, నీటి పన్ను బకాయిలు ఉండకూడదన్నారు. వేలం పాటకు సంబంధించిన డిపాజిట్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్ : మోడల్ స్కూల్స్‌లో పని చేసే ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిచాలని మోడల్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కోరారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై న యంవీ రామచంద్రారెడ్డిని గురువారం కడపలోని తమ కార్యాలయంలో అసోసియేషన్ నాయకులతో కలిసి అభినందనలు తెలిపారు. మోడల్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్, స్టేట్ కో–ఆర్డినేటర్ రాజశేఖర్ సభ్యులు జయచంద్ర, మారుతి, దేనియల్, వివేకానందరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



హెడ్‌కానిస్టేబుల్ సతీమణి సుభాషిణికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: పోలీస్‌శాఖకు వెలకట్టలేని సేవలందించిన వారికి జిల్లా పోలీసుశాఖ అండగా ఉంటుందనీ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ భరోసా ఇచ్చారు. సిద్దవటం పి.ఎస్.లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులను నిర్వర్తించే కె. కొండయ్య (హెచ్‌సి 812) ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి కె. సుభాషిణికి కార్పస్ నిధి నుంచి మంజూరైన రూ. లక్ష ఆర్థిక సాయాన్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. డి.పి.ఓ జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌టెన్నిస్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



జిల్లా క్రీడాకారిణి అభిగాలితో కోచ్

కడప స్పోర్ట్స్ : ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించిన జాతీయస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది. ఏపీ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన జె. అభిగాలి చక్కటి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టు మూడోస్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించింది. వైఎస్ఆర్ కడప జిల్లా సాఫ్ట్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.రేవంత్ జట్టు కోచ్‌గా వ్యవహరించారు.

జర్నలిస్టు కాలనీ పార్కులో సౌకర్యాలు కల్పించాలి



జర్నలిస్టు కాలనీ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరం రిమ్స్ సమీపంలో ఉన్న జర్నలిస్టు కాలనీ పార్కులో ఓపెన్ జిమ్, ప్లాట్‌ఫారంకు మరమ్మతులు చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన సోమయాజులపల్లె, రిమ్స్, రాజీవ్ మార్గ్ రోడ్డు ప్రాంతాలను పరిశీలించారు. సోమయాజులపల్లెలో పలువురు చిన్నారులు స్కూలుకు వెళ్లకుండా ఆడుకోవడాన్ని గమనించి వారిని ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ఎన్‌జీవో కాలనీ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. అలాగే చిన్నచౌకు జయనగర్ కాలనీ జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ 15 నిముషాలు యోగా చేయాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పొదుపు చేయకుంటే కష్టమే!



ర్యాలీ నిర్వహిస్తున్న జేవీవీ నాయకులు

కడప కల్చరల్ : నీటిని పొదుపుగా వాడకుంటే భవిష్యత్తులో కష్టాలు తప్పవని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవ సందర్భంగా జేవీవీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రవీంద్రనగర్‌లోని విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులకు ఆయన నీటి వినియోగం, పొదుపు గురించి వివరించారు. ప్రపంచ నీటి దినోత్సవ సందర్భంగా అన్ని దేశాలలోనూ నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థినికేతన్ పాఠశాల నుంచి మరాఠీవీధి, మురాదియానగర్, అక్కాయపల్లెలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవంపై స్థానిక ప్రజలకు వివరిస్తూ వారిలో చైతన్యం నింపారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నగర నాయకుడు మధుసూదన్, ఇతర సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాసరాజు, సువర్ణలత పాల్గొన్నారు.

రంజాన్‌లో మసీదుల వద్ద శుభ్రపరచాలి

కడప కార్పొరేషన్ : పవిత్ర రంజాన్ మాసంలో నగరంలోని మసీదుల వద్ద ప్రతిరోజూ శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ అన్నారు. గురువారం ఆయన కమిషనర్‌కు వినతిపత్రమిచ్చారు. ఉదయం, రాత్రి రెండు పూటలా మసీదుల వద్దనున్న చెత్తను ఎత్తించాలన్నారు. అలాగే ముస్లింలు నివాసం ఉన్న ప్రాంతాల్లో ప్రతిరోజూ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నమాజు వేళల్లో కరెంటు సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు.

మజ్జిగ పంపిణీ అనుమతికి విజ్ఞప్తి

కడప అర్బన్ : కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి ప్రతి సోమవారం తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు మజ్జిగను పంపిణీ చేసేందుకు అనుమతిని ఇవ్వాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ వారు గురువారం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ రాయలసీమ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ బాషా, జనరల్ సెక్రటరీ జి. విజయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్ కె. శివసుబ్బన్న, కడప జిల్లా జనరల్ సెక్రటరీ రాజశేఖర్ రాజు, జిల్లా వెల్ఫేర్ సెక్రటరీ చంద్రబోస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో డీసీసీ బ్యాంకు

నాబార్డు జీఎం జయాకన్నన్



వాహనాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు జీఎం జయాకన్నన్, డీసీసీబీ సీఈఓ రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : కడపలోని డీసీసీ బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తుందని సొసైటీల అభివృద్ధికి కడప డీసీసీ బ్యాంకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని నాబార్డు జీఎం జయాకన్నన్ పేర్కొన్నారు. బీవీఆర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ వారికి నాబార్డు ఆర్థిక సహాయంతో ఇచ్చిన టెంపో వాహనాన్ని గురువారం కడప డీసీసీ బ్యాంకు ఆవరణలో బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా రైతుల నుండి మామిడి పండ్లు సేకరించి మార్కెట్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం జాయింట్ లైబిలిటి సంఘాలకు రూ.1,37,00,000 రుణ సహాయం ఆయన చేతుల మీదుగా వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం విజయ విహారి, డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్, పీడీసీ ఇన్‌చార్జు వీర శంకర్, డీసీసీ బ్యాంకు మేనేజర్ గంగాధర్, ఆర్‌హెచ్‌జిబిఎంఎస్ఎస్ ఎన్‌జీవో రత్నం పాల్గొన్నారు.

పసుపు కొనుగోలుకు సీఎం ఆదేశం

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి

చాపాడు : వైఎస్సార్ కడప జిల్లాలో పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి జిల్లాలో పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అవసరమైన పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులకు సూచించారని ఆయన పేర్కొన్నారు. కాగా బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ పసుపు రూ.4,600లు ఉండగా, ప్రభుత్వం మద్దతు ధరగా రూ.6850 ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. దీని ద్వారా పసుపు సాగు చేసిన ప్రతి రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా రైతులకు అందుబాటులో ఉండేలా పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చెప్పారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

భూసార పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఏఓ



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీఏఓ

కడప అగ్రికల్చర్: భూసార పరీక్షలను సకాలంలో పూర్తి చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని భూసార పరీక్ష కేంద్ర ఏడీఏ, ఏవోలను జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రావు సూచించారు. గురువారం కడప ఊటుకూరులోని భూసార పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్టి నమూనా కేంద్రంలోని పరికరాలను పరిశీలించడంతో పాటు వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన మట్టి నమూనాలను పూర్తి చేసి ఫలితాలను వారికి సకాలంలో అందించాలని ఆదేశించారు. భూసార పరీక్షా కేంద్రంలో కొన్ని పరికరాలు పనిచేయడం లేదని ఏడీఏ లక్ష్మీదేవి డీఏఓ నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. భూసార పరీక్ష కేంద్ర ఏవోలు మంజలరాణి, సుదేష్ణ, ఎంఎస్‌టిఎల్ ఏవో పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలపండి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత



మాట్లాడుతున్న జడ్జి కవిత, పాల్గొన్న మహిళా జైలు అధికారులు, మహిళా ఖైదీలు

కడప అర్బన్ : సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత మహిళా ఖైదీలకు సూచించారు. గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నగర శివార్లలోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఖైదీల కుటుంబసభ్యులు పొందేందుకు న్యాయసలహాలు, న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థను, పారా లీగల్ వలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, డాక్టర్, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అట్లూరు : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక కేజీబీవీ స్పెషలాఫీసర్ పణిశ్రీ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, 11వ తరగతి ప్రవేశానికి అలాగే 7,8,9 తరగతులలో మిగిలిన సీట్లకు సంబంధించి కూడా ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 లోపల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయట, బడిమానిన, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

సన్మానం

చాపాడు : అల్లాడుపల్లె దేవాలయ వేదపండితుడు వేణుతుర్ల నరేంద్ర శర్మను గురువారం శ్రీ బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో సన్మానించారు. నియోజకవర్గ కేంద్రమైన బద్వేలులో శ్రీ బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన పలువురిని సన్మానించారు.

పోషకాలున్న ఆహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జయకుమారి

కమలాపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులందరూ పోషకాలున్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయకుమారి తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి జరుగుతున్న 5వ పోషణ్ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలు అధికంగా ఉన్న ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర వాటితో పోషణ్ పక్వాడ లోగో ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషణ్ పక్వాడ గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో అనీమియా, రక్తహీనతను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్వాడ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పోషక విలువలు అధికంగా ఉన్న పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు అధికంగా తీసుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, 1వ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



పెద్దపుత్త గ్రామంలోని ఆలయం వద్ద దాతలు, పరిశోధకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పురావస్తుశాఖ సహాయ ఆచార్యులు దివంగత వి.రామబ్రహ్మం, పరిశోధక బృందం చేపట్టిన పరిశోధనల ఫలితంగా వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామంలోని శ్రీయోగాభిరామాలయం వెలుగులోకి రావడంతో ఆ ప్రాంతవాసులు ఆలయానికి విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం యూఎస్ఏకి చెందిన చిట్టప్రగడ లలిత, రాజమండ్రికి చెందిన జి.వి.రమణ, డా. టి.వి.నారాయణరావులు రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఆలయానికి సంబంధించిన చారిత్రక అంశాలను వైవీయూ సహాయ ఆచార్యులు డా. వి. రామబ్రహ్మం, సహ పరిశోధకులు డా. చల్లా శివకుమార్, డా. జంగారి నారాయణలతో కలిసి వెలుగులోకి తీసుకువచ్చారు. ఆలయ చరిత్రను తెలుసుకున్న వీరు పెద్దపుత్తలోని శ్రీయోగాభిరామాలయాన్ని సందర్శించారు. మూలవిరాట్టును దర్శించుకుని సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు నిధులు ఖర్చుచేయాలని ఆలయ నిర్వాహకులను కోరారు.

నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు

- కడపలో భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న 'శ్రీహరి' కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తదితరులు



సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్‌కి నివాళి అర్పిస్తున్న చంద్ర తదితరులు

కడప ఎడ్యుకేషన్ : దేశ స్వాతంత్య్ర పోరాట యోధుడైన భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని ఆయనను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధిస్తాం

భగత్‌సింగ్ ఆశయాలకు మనందరం సాధిస్తామని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడపలోని గీతాంజలి కళాశాలలో ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడదాం..

భారతదేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ జయవర్ధన్ అన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం..

భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో రాయలసీమ సమస్యలపై పోరాటం చేసి ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. కడపలోని ఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో భగతసింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

భగత్‌సింగ్ ఆశయాల కోసం కృషి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు దస్తగిరి, వలరాజు, మద్దిలేటి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నీచ రాజకీయాలకు పరాకాష్ట

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు నీచ రాజకీయాలు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం చంద్రబాబుకు కొత్తకాదన్నారు. తెలంగాణలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయారన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అందులో కొందరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో ఉదాహరణలు ఉన్నాయన్నారు. తాజాగా ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అదే సాంప్రదాయానికి తెరతీశారన్నారు. సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ తరఫున అభ్యర్థిని నిలిపారన్నారు. ఇలాంటి నీచ రాజకీయాలు తాత్కాలికంగా లబ్ధి చేకూర్చవచ్చునేమోగానీ దీర్ఘకాలికంగా ఏమాత్రం ప్రభావం చూపలేవని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని, వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని తెలిపారు.

'ఎన్‌డీఆర్‌ఎఫ్'స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- తహసీల్దార్ గంగయ్య
- మామిళ్లపల్లె ఎన్‌సీసీ ప్రాంగణంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమం



ప్రమాదకర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్ : విపత్కర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ సహాయక చర్యల స్ఫూర్తితో సమాజంలో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా కాపాడే సామాజిక బాధ్యత అందరిపై ఉందని సీకే దిన్నె తహసీల్దార్ గంగయ్య తెలిపారు. కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో సీకే దిన్నె మండల పరిధిలోని మామిళ్లపల్లె ఎన్‌సీసీ శిక్షణ ప్రాంగణంలో ప్రమాదాలు సంభవించినపుడు వెంటనే ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల తహసీల్దార్ గంగయ్య, స్థానిక కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, అగ్నిమాపకశాఖ ఎస్ఐ జలీల్, ఎన్‌సీసీ సూపరింటెండెంట్ సుబేదా హనుమాన్‌సింగ్‌లు హాజరై పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను, మాక్ ఎక్స్‌ఫర్మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ట్రైనింగ్ టీమ్ లీడర్ మహమ్మద్ అలీ, ఎన్‌సీసీ క్యాడెట్లు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి



వాహనదారుల రికార్డులను పరిశీలిస్తున్న కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం

కడప అర్బన్ : కడప నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీసు అధికారులు గురువారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేశారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాసాపేట సర్కిల్‌లో సీఐ సయ్యద్ హాసం తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. ప్రతి వాహనదారుడు తాను వాహనంపై బయటకు వచ్చే సమయంలో కచ్చితంగా రికార్డులు కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, వాహనాల కాలుష్య నివారణ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్‌లను తీసుకురావాలన్నారు.

- కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజారెడ్డి వీధిలో ఎస్ఐ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. వాహనాలు నడుపుతున్న కొందరు మైనర్లను గుర్తించి.. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లుగా వున్న వారు వాహనాలను నడిపితే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయన్నారు.

రామాయణం మానవాళికి మార్గదర్శకం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, నగర ప్రముఖులు



మాట్లాడుతున్న స్వామి తురియానంద

కడప కల్చరల్ : మానవాళి ఎలాంటి మార్గంలో నడవాలో రామాయణం చెబుతుందని స్వామి తురియానంద అన్నారు. కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో వసంత నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. రెండవరోజు కార్యక్రమంలో భాగంగా రాత్రి చిన్మయ మిషన్ జిల్లా అధ్యక్షుడు స్వామి తురియానంద అధ్యక్షతన జిల్లాలో రామాయణం రచించిన కవులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సత్యవాక్కుకుల విలువను ఆవు, పులి కథద్వారా వివరించారు. ఆ కథ బాలలపై ఎంతో గొప్ప ప్రభావం చూపి విలువలవైపు నడిపించగలదన్నారు. మన పెద్దలు మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకే పురాణేతిహాసాలను రాశారని తెలిపారు.

అనంతరం రామాయణ రచయితల్లో ఒకరైన పుత్తా పుల్లారెడ్డి మాట్లాడుతూ పలు రకాలైన రామాయణాలలో తేడాలను గమనిస్తూ తాను రామాయణం వైపు ఆకర్షితుడిని అయ్యానని తెలిపారు. అన్నపూర్ణక్షేత్రం నిర్వాహకులు గండ్లూరి నారాయణరావు, యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మూల మల్లికార్జునరెడ్డి, ప్రముఖ గైనకాలజిస్టు సులోచన, కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి కూడా మాట్లాడారు. తొలుత ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అతిథులు శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులకు ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమానంతరం నిర్వాహకులు రాయాయణకర్తలను నూతన వస్త్రాలతో సంప్రదాయ బద్ధంగా ఘనంగా సత్కరించారు.